రాఘవయ్య రాజకీయాలు

రత్నమ్మకు మొదట్నుండీ తన మగని గొప్పతనం మీద అమోఘమైన విశ్వాసం. పెండ్లికి ముందు తన కాబోయే భర్తపేరు రాఘవరావు, బియ్యే యల్టీ అని విన్నప్పుడు ఆమె కన్యా హృదయం గర్వంతో గంతు లేసింది. పెండ్లి చేసుకొని, తన కింక జయించదగిన ప్రపంచాలే లేవన్నంత సంతృప్తితో ఆమె అత్తగారింటికి వచ్చింది. అత్తగారింట్లో అందరూ — అంటే అత్తామామా తన భర్తను రాఘవయ్యా అనడం చాలా నామర్దాగా తోచింది. బియ్యేయల్టీ అంతవాణ్ని పట్టుకొని మామూలు మనిషి వలె రాఘవయ్యా అనడం సహించరాని విషయం అని ఆరాత్రే ఆమె భర్తతో పేచీ పెట్టింది. పేరులో యేముంది లెమ్మని రాఘవయ్య ఉదాసీనంగా జవాబిచ్చినాడు. రత్నమ్మ వెంటనే అనునయం ప్రయోగించింది; తరువాత ఆగ్రహం చేసింది; ఆ తరువాత కన్నీరు కురిసింది. ఈ ఒక్కొక్క ఆయుధాన్నీ సమర్థంగా నిగ్రహించిన రాఘవయ్య, ఆఖరు దశలో అన్ని ఆయుధాలూ కలసి ఒక్కుమ్మడిగా ఏకముఖంగా చేసిన దండయాత్రకు జడిసి అర్ధరాత్రయ్యేటప్పటికి దాసోహం అన్నాడు. ఉదయమే యింటిల్లిపాదికీ ఉత్తరువులు జారీ ఐనాయి — రాఘవయ్యను అందరూ రాఘవరావు అనవలసిందే అని.

అటు తర్వాత తన మగడు చేసే నామర్దా పనులన్నీ క్రమంగా ఒక్కొక్కటే అర్థమైనాయి రత్నమ్మకు. అన్నిటికంటే నామర్దాపని అసలు బియ్యేయల్టీగా వుండి హైస్కూలు టీచర్ పని చేయడమే. ఉత్త బియ్యేలందరూ తాసీల్దార్లుగానూ, డిప్టీకలెక్టర్లుగానూ వుండగా తన మగడు

బియ్యేయల్టీ రాఘవరావు – కేవలం ఒక అనామక స్కూల్ టీచర్‌గా వుండడమేమని రాఘవయ్యను నిలదీసి అడిగింది – ఒక ఆదివారం రాత్రి రెండవ జామున. 'మీకెట్లున్నదో గాని, నాకేమో నలుగురిలోనూ తల గొట్టినట్లున్నదండీ' అని అడగడం ఆరంభమౌతూనే, అసలుకే మోసం వస్తుందేమో అన్న భయంతో రాఘవయ్య మెదడు వేగంగా పనిచేసి, ఘాటైన సమాధానం సమర్పించింది. "యింతకంటె మంచి వుద్యోగం నీవే యిప్పించుమరి – దీనికి రాజీనామా చేస్తాను," అన్నాడు రాఘవయ్య పిరికి పిరికిగానే. సమస్య యెదురు తిరిగేటప్పటికీ రత్నమ్మ నోరు కట్టుబడింది గానీ, మనస్సు ఆలోచన లంకించుకుంది. ఒక నెల ఏకాగ్ర చిత్తంతో కృషి చేసి ఆమె ఒక సమగ్రమైన సిద్ధాంతం తయారుచేసింది. తన మగడు చాలా గొప్పవాడనీ – బియ్యేయల్టీ ఐన తర్వాత గొప్పవాడు కాకపోవడ మేమిటని ఆమె అవగాహనయొక్క పునాది – తన మగడు నిజంగా చాలా గొప్పవాడనీ, ఐతే అతని గొప్పతనం అతనికే తెలియదనీ, వెరసి మొత్తంమీద ఆతను తన గొప్పతనం తనకే తెలియనంత గొప్ప వాడనీ, అందుచేత అతనికి అనుక్షణమూ తన గొప్పతనాన్ని గుర్తింజేస్తే తప్ప జీవితంలో వృద్ధికి రాలేడనీ, పతివ్రత ఐన తనకు – అందులోనూ భారతీయ పతివ్రత ఐన తనకు – అంతకు మించిన పవిత్ర కర్తవ్యం వుండబోదనీ ఆ సిద్ధాంతంలోని సుస్థిరమైన ప్రాథమిక సూత్రాలు. ఆ పవిత్ర కర్తవ్య నిర్వహణ రత్నమ్మ ఆ రాత్రే ఆరంభించింది. ఆమె వాదబలమూ, వాక్పటిమా, వాడి నాలుకా వరుసగా మూడు రాత్రులు చవి చూసేటప్పటికి రాఘవయ్యకు తన గొప్పతనం ఒప్పుకోక తప్పింది గాదు. తన గొప్పతనమంతా బేషరతుగా ఒప్పుకొని, తాను నిజంగా ఎంత గొప్ప వాడు కాకపోతే తనకు రత్నమ్మంతటి గొప్ప భార్య దొరుకుతుందని రత్నమ్మ గొప్పతనమూ ఒప్పుకొని, యింకా అనేక విధాల ఆమెను

సంతృప్తి పెట్టి, ఆ అమృత ఘడియలోనే ఒక చిన్న వరం కోరినాడు రాఘవయ్య : "నీవు చెప్పినట్లే నడుచుకుంటాను కానీ – ఆ చెప్పేదేదో పగలే చెప్పరాదా" అని. ఆ మాటతో రత్నమ్మకు యే రస సీమాంచలాలు ధ్వనించినాయో ! కిలకిల నవ్వి, "మీ మగవాళ్ళంతా యింతేనండీ" అంటూ, అడిగిన వరం కాస్తా అనుగ్రహించింది – ఆరు మాసాల అనంతరం పరిస్థితిని పునఃపరిశీలించే షరతుమీద.

ఆ ఆరు మాసాలలో రత్నమ్మ హృదయకవచంలోని మరికొన్ని బలహీన ప్రదేశాలు వెదకి వెదకి తెలుసుకున్నాడు రాఘవయ్య. ఆ ప్రదేశాలమీద నేర్పుతో దెబ్బతీసి ప్రయోజనాలు పొందే విధానం కూడా ఒకటి అనేక ప్రయోగాలు చేసి రూపొందించుకున్నాడు. జీవితంలో యాదృచ్ఛికంగా జరిగే ఘటనలన్నీ, దుర్ఘటనలు కూడా, సక్రమంగా వాడుకుంటే సత్ఫలితా లిస్తాయన్న సత్యం కూడా రాఘవయ్య స్వయంగా ఆచరణ పూర్వకంగా కనిపెట్టినాడు. ఐదో నెలలో గర్భస్రావమై, రత్నమ్మ చావు బ్రతుకులమీద వున్నప్పుడు, ఆమెను ఒప్పించడానికి యింతకు మించిన సమయం దొరకదని పాచిక వేసినాడు. వేరే వుద్యోగం కొరకు ప్రయత్నం చేయడం వ్యర్థమనీ, తమకు అంతో యింతో ఆదాయం వచ్చే భూవసతి వున్నందున వుద్యోగం కొరకు మరీ అడ్డమైన వాళ్ళనూ ఆశ్రయించవలసిన దుర్గతి యేమీలేదనీ, యింతకూ టీచర్ వుద్యోగంలో కంటే ప్రశాంతమైన జీవితం మరెక్కడా వుండదనీ, ఐనా భార్య యింత ఆపదలో వుండగా తాను తగుదునమ్మా అని ఉన్నత పదవుల కొరకు ప్రయత్నం చేయడం మనిషి ఐనవాడు చేయకూడని పని అనీ, యింకా అనేకానేక కారణాలు చూపించి, మెల్లగ ముఖ్య తీర్మానం ప్రతిపాదించి నాడు – హైస్కూల్లోనే అంటిపెట్టుకొని ప్రమోషన్ కొరకు ప్రయత్నం చేయడం అన్నిటికంటె శ్రేష్ఠం అని. శారీరకంగా మానసికంగా అతి

దుర్బల స్థితిలో వున్న రత్నమ్మ, యెదురువాదం చేసే వోపికలేక, భర్త ముఖంలోకి దయనీయంగా ఒక చూపు చూసి, "సరే లెండి" అని మూల్గింది.

ఈ విధంగా దుర్ఘటనలను స్వప్రయోజనాలకు వాడుకోవడం అన్యాయమని తొలి రోజుల్లో అతని అంతరాత్మ కొంత గోలచేసింది. క్రమంగా అతను తగిన శిక్షణ యిచ్చి అంతరాత్మను అనుకూలంగా మార్చుకున్నాడు. తరువాత యెన్నేండ్లు గడచినా ప్రమోషన్ రాకపోవ డానికి సమాధానాలూ, సంజాయిషీలూ చెప్పుకోవడంలో అతనికి అనేక ఘటనలు తోడ్పడుతూనే వచ్చినాయి. ఒకసారి అతని తండ్రి మరణించి నాడు. మరొకసారి కూతురు పుట్టింది. యింకొకసారి తల్లి మరణించింది. వేరొకసారి అతనికే చచ్చేటంత రోగం వచ్చింది. ఇటువంటి ఘటన లన్నిటినీ అతను అదృష్టదేవత అనుగ్రహాలుగానే స్వీకరించి సద్వినియోగం చేసుకున్నాడు. ఈ విధంగా దాదాపు యిరవైయేండ్లు రత్నమ్మతో హోరా హోరి పోరాడి, తన మేధాసంపదనంతా ఆమెను రేయింబగలూ మభ్యపెట్ట డానికే వినియోగించి, హైస్కూల్లో గోడగడియారం ఆజ్ఞల ప్రకారం యాంత్రికంగా పాఠాలు చెప్పి, హఠాత్తుగా దేశంలో హైస్కూళ్ళ సంఖ్య పెరిగినప్పుడు అనేకులతో పాటు రాఘవయ్య కూడా ఒక హెడ్మాస్టర్ ఐనాడు. ఆ ప్రమోషన్ నిత్య జాగరూకమైన తన పాతివ్రత్య మహాత్మ్య మేనని రత్నమ్మ సంతృప్తి పడి, వున్న ఒక్క కూతురుకూ పెండ్లిచేసి, రాఘవయ్యమీద అజమాయిషీ కొంత తగ్గించింది.

రాఘవయ్య రిటైర్ ఐనప్పుడు, రోజూ యింటి పనులు చేయడానికి వస్తూవుండిన హైస్కూలు నౌకరు యింటివైపే చూడకపోవడంతో రత్నమ్మ ఆత్మాభిమానం మళ్ళీ దెబ్బతినింది. అతని గొప్పతనానికి తగిన

వుద్యోగమో, కనీసం వ్యాపారమో, యేదో ఒకటి చూడమని ఆమె రాత్రి పూట దండయాత్రలు పునఃప్రారంభించింది. రిటైర్ అయినప్పటినుండి అన్ని సుఖాల కంటె మధ్యాహ్నం నిద్రకే యెక్కువ విలువ యిస్తున్న రాఘవయ్య ఆమె దండయాత్రలను అంతగా లెక్కబెట్టకుండా "మన యోగ్యతకు తగిన ఉద్యోగం వస్తే ఎందుకు చేయనూ" అంటూ కాలం గడుపుకొస్తున్నాడు. అప్పటి నుండి రత్నమ్మ రోజూ యిరుగు పొరుగులను విచారిస్తూనే వుంది — తన మగనికి, బియ్యేయల్టీ రాఘవరావుకు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌కు, తగిన ఉద్యోగం యెక్కడైనా వుందా అని. ఆనాడే పొరుగింటి మునిసిపల్ కౌన్సిలర్ భార్య సుబ్బమ్మ యమ్మెల్సీ యెలెక్షన్‌ల విషయం అంతా, అంటే ఆమెకు తెలిసిందంతా, వివరించి, "హెడ్మాస్టరు గారు వోటడుగుతే, యే టీచరయినా యివ్వనంటాడా రత్నమ్మా" అని ముక్కుమీద వ్రేలేసుకొంది.

ఆ రాత్రి అన్నం తింటూనే రత్నమ్మ పాతివ్రత్యం రాగాలాపన ఆరంభించింది, "యమ్మెల్సీ కావడానికి మీకంటే యోగ్యుడున్నాడా" అని. "ఎలెక్షన్‌కు డబ్బెక్కడుందీ?" అన్నాడు రాఘవయ్య మొదట, అందులో తనదేమీ తప్పులేదన్నట్లు. "మనకేం, పిల్లా మేకా? వున్న భూమి అమ్మేయండీ" అన్నది రత్నమ్మ బుజ్జగిస్తూ. "నాకు వోట్లు ఎవరిస్తారూ?" అన్నాడు అతను జాలిగా. "అందరూ యిస్తారు. ఎందు కివ్వరూ?" అన్నది ఆమె ధీమాగా. "ఎప్పుడూ ఏ టీచరుకూ ఏ సహాయమూ చేసి యెరుగనే, వాళ్ళను వోట్లు అడిగేదెట్లా?" అన్నాడు అతను, ఆముదం తాగిన అబ్బాయి ముఖం పెట్టి. "సుబ్బమ్మ మొగుడు ప్రతిసారీ మునిసిపల్ కౌన్సిల్ మెంబర్ ఔతూనే వున్నాడే, యెప్పుడు యెవరికి యే సహాయం చేసినాడో చెప్పండి" అన్నది ఆమె — మీకు కొంచెమన్నా లోకజ్ఞానం లేదే అన్నట్లు చూస్తూ. ఆర్గ్యుమెంటుకు ఒక

పాయింటు దొరికిందన్న తొందరలో రాఘవయ్య ధిక్కారంగా "అయితే అర్ధ రూపాయకు అమ్ముడు పోయే మునిసిపల్ వోటర్లూ టీచర్లూ వొకటే నంటావా?" అన్నాడు. రత్నమ్మ ఆశ్చర్యంతో కండ్లు పెద్దవి చేసి "చదువుకుంటే మాత్రం మనుషులకు బుద్ధులు మారతాయాండీ? మునిసిపల్ పద్ధతులే కొంచెం నాజూకుగా ప్రయోగించాలిగానీ" అని, అంత తోనే కంఠం మార్చి "అంటే డబ్బిచ్చేరండీ! వాళ్ళను మాటలతోనే బుట్టలో వేసుకుంటే, వాళ్ళనూ గౌరవించి నట్లుంటుంది" అన్నది.

ఇక ఈ రంగంలో లాభం లేదని రాఘవయ్య ద్వంద్వ యుద్ధంలో రెండవ రంగం మొదలు పెట్టినాడు — "యీ వయస్సులో నాకీ గౌరవాలన్నీ యెందుకు చెప్పు — హాయిగా యింట్లో కూర్చొని నిశ్చింతగా బ్రత క్కుండా?" అంటూ. ఆ మాటకు రత్నమ్మ చురచుర చూసి, "ఈ వయస్సులో మీరు యింట్లో కూర్చొని చేసేదేముంది చెప్పండి — మీ యోగ్యతకు తగినట్టు పది మందిలో గౌరవమైనా పొందకుండా?" అని దండించింది. ఇదీ లాభం లేదనుకొని, అతను మరొక వైపు నుండి వాదం ప్రారంభించినాడు, "ఒక వేళ నీ ఆశీర్వాద బలంతో యమ్మెల్సీ నౌతాననుకో, ఐతే మాత్రం వొరిగేదేముందీ?" అని. "అయ్యో నా ఖర్మా!" అని ఆమె అర్జంటుగా నోరు నొక్కుకొని, యమ్మెల్సీ ఐతే, యెంత దర్జా, యెంత పలుకుబడి, యెంతెంతటి వాళ్ళతో పరిచయం, యెంత మందిలో యెంత గౌరవం" అంటూ దీర్ఘంగా ఉద్ఘాటించి, "యింత అమాయకునితో యిన్నాళ్లూ నేనెట్ల కాపురం చేసినానురా దేవుడా" అని సవిలాసంగా తన్ను తానే దెప్పుకుంది. ఆ మాటతో రాఘవయ్య ముఖం మీద చిరునవ్వు అంకురించింది. తానిన్నాళ్ళూ యెంత తెలివిగా రత్నమ్మ మీద యెన్ని ఘనవిజయాలు సాధించిందీ తలచుకొని మెల్లగా నవ్వుకున్నాడు అతను. ఈ చిరునవ్వేమిటో అర్థంకాక ఆమె తికమక పడుతూ వుండగానే

అతను ఒక ప్రశ్న వేసినాడు. ఈ ప్రశ్నతో రత్నమ్మ యింక తోక ముడువవలసిందే అనుకుంటూ: "టీచర్లు నాకు వోట్లిచ్చి నన్ను గెలిపిస్తే, నేను వాళ్ళకు చేయగలిగేదేముంది చెప్పు?" రత్నమ్మ కన్నీళ్ళ పర్యంతమై, "యెంత తెలివి తక్కువండీ మీకూ — వాళ్ళకు చేయమని యెవరన్నారూ — మన సుఖం మనం చూసుకోవాలగానీ" అని చేతులు త్రిప్పుతూ వచ్చి అతని ప్రక్కన కూర్చొని, "నేను లేకపోతే మీరెట్లా బ్రతుకుతారండీ" అని గోము చేసింది. రాఘవయ్య ఒక మూరెడు దూరం జరిగి, యింక చరమాయుధం ప్రయోగిస్తే తప్ప ప్రయోజనం లేదని, ముఖం అవతలివైపు త్రిప్పుకొని "నీ వెన్నైనా చెప్పు. ముక్కూ ముఖమూ చూడని వాళ్ళందరినీ వోట్లడిగి ప్రతి వెధవతోనూ లేదనిపించుకొని, నే నవమానం పాలు కాలేను" అన్నాడు. ఆ మాట వెంటనే ఆమె అమాంతం అతన్ని కౌగిలించుకొని, అతని భుజంమీద తల మోపి వలవల యేడ్చింది; కన్నీరు మున్నీరుగా యేడ్చింది; యింత పతివ్రతను యింతగా యేడిపిస్తే మీ పరలోకాలకు గూడా ప్రమాదమే గదా అంటూ యేడ్చింది; రేపే రైలు క్రింద పడతానంటూ యేడ్చింది; అనేక స్వరాలలో అనేక భంగిమలలో యేడ్చింది.

రాత్రి మూడుగంటల దాకా వాదోపవాదాలూ, తర్కవితర్కాలూ చేసి రత్నమ్మ కన్నీళ్ళతో ఒక భుజమంతా తడిసిన తర్వాత, రాఘవయ్యకు హఠాత్తుగా మెరుపువంటి ఆలోచన వచ్చింది, "ఈ పీడకంటె నామినేషన్ వేస్తే యేం? యెంత పోయినా డిపాజిట్ మొత్తమేగదా పోతుంది!" అని. ఇంత గొప్ప ఆలోచన తనకే వచ్చినందుకు తన్ను తానే అభినందించుకుంటూ, అప్పుడే తన అంగీకారం తెలియజేసి, మూడు నిమిషాల్లో రత్నమ్మను లాలించి, చాలా ప్రొద్దు పోయిందని వెంటనే నిద్రపోవడానికి అనుమతి కోరినాడు.

నామినేషన్ వేసి నాలుగురోజులు ప్రచారం చేసేటప్పటికి రాఘవయ్య అంచనాలన్నీ తల్లక్రిందులైనాయి. తన సామర్థ్యమో, తన వెంట వున్న సుబ్బమ్మ మగని సామర్థ్యమో అడిగిన వాళ్లెవ్వరూ వోటు యివ్వమని అనలేదు. డిపాజిట్ పోతుందనుకొని, రత్నమ్మను మభ్యపెట్టడానికి మాత్రమే ప్రచారానికి బయలుదేరిన రాఘవయ్య గెలిచే అవకాశాలు విపరీతంగా కనబడేటప్పటికి, హైదరాబాదులో యమ్మెల్సీలకు తగిన సౌకర్యాలున్నాయి గదా అని విచారించడం మొదలుపెట్టినాడు—ముఖ్యంగా మధ్యాహ్నం నిద్రపోవడం వగైరా సౌకర్యాలు. ఆ విషయంలో యమ్మెల్యేలకూ యమ్మెల్సీలకూ యేమీ లోటు వుండదని మునిసిపల్ కౌన్సిలర్ యిచ్చిన హామీతో రాఘవయ్య దృష్టి అంతా హైదరాబాదుమీదనే పడింది – సంవత్సరానికి ఆరు నెలలైనా రత్నమ్మ వంటి పతివ్రతతో వియోగ సుఖం అనుభవించవచ్చు గదా అని.

(జూన్ 1958)